క్లుప్తంగా

విశ్వబ్రాహ్మణ సంఘం కమిటీ ఎన్నిక

నర్సంపేట : చెన్నారావుపేట విశ్వబ్రాహ్మణ సంఘం కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాసమల్ల సతీశ్ మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా వజ్జంతి రంజిత్, ప్రధాన కార్యదర్శి మడుప రాజు, సహాయ కార్యదర్శిగా వజ్జంతి రమేష్‌లను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ ఎన్నికలు మండల అధ్యక్షుడు సలేంద్ర రుద్రమాచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు కొండపర్తి గంగయ్య, రమేశ్ పాల్గొన్నారు.

భవననిర్మాణ కార్మిక సంఘం కమిటీ

నెక్కొండ : మండలంలోని సూరిపల్లి గ్రామ భవన నిర్మాణ కార్మిక సంఘం ఎన్నిక ఏకగ్రీవంగా మంగళవారం జరిగింది. అధ్యక్షుడిగా సింగారపు రంజిత్, ఉపాధ్యక్షుడిగా వద్ది శ్రీనివాస్, కార్యదర్శిగా సింగారపు మధుసూదన్, కోశాధికారిగా చిగుర్ల చేరాలుతో పాటు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. ఎన్నికకు సహకరించిన అందిరికి అధ్యక్షుడు రంజిత్ కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నర్సంపేట: విద్యుత్ సరఫరాకు నేడు (బుధవారం) అంతరాయం ఉంటుందని డీఈ తిరుపతి, చెన్నారావుపేట విద్యుత్ ఏఈ జోగానంద్‌లు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ 33 కేవీ చెన్నారావుపేట, ఉప్పరపల్లి విద్యుత్ లైన్లలో మరమ్మతుల దృష్ట్యా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. 33/11కేవీ అమీనాబాద్, ఉప్పరపల్లి ఉప కేంద్రాల్లోని వినియోగదారులు గమనించాలని కోరారు.

నారాయణరావుకు ఫోన్‌లో కేసీఆర్ పరామర్శ

పర్వతగిరి: మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మేనత్త, మండలం ఏనుగల్లు గ్రామానికి చెందిన వరంగల్ ఏనుమాముల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తక్కళ్లపల్లి నారాయణరావు తల్లి తక్కళ్లపల్లి సుభద్రదేవి ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లు మంగళవారం నారాయణరావు, భాస్కర్‌రావు, వరద రాజేశ్వర్‌రావుకు ఫోన్ చేసి పరామర్శించారు.

గంగమ్మతల్లికి పూజలు



నల్లబెల్లి: మండల కేంద్రంలో యాదవ కాలనీలో యాదవ కులస్తుల కులదైవం గంగమ్మ తల్లి, మల్లన్న దేవలతకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. కులపెద్ద బత్తిని ఒదేలు ఇంట్లో కడెం యాకుమల్లు గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేయగా ఒదేలు కుటుంబ సభ్యులు బోనాన్ని నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మందహెచ్చుల కళాకారులు భాస్కర్, వీరమల్లు, నరేష్, నవీన్, యాకలక్ష్మి, రమ, మల్లన్న, పెద్దిరాజు, పెద్దమ్మ కథలు చెప్పగా పలువురిని ఆకట్టుకున్నాయి. యాదవ కుల పెద్దలు రాజారాం, మల్లయ్య, రాజన్న, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలి



రాయపర్తి : రేషన్ షాపుల్లో వెంటనే ప్రధాని మోదీ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు నూనె అనిల్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న సన్నబియ్యం పంపిణీ కోసం కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఏడాదికి రూ.పదివేల కోట్లు ఇస్తుందని తెలిపారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తామే ఇస్తున్నట్లు చెప్పుకుంటోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవి, నరేందర్, శ్రావణ్‌కుమార్, ప్రశాంత్, గణేష్, సుమన్, రాజు, దినేష్, సురేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు డబ్బులు చెల్లించాలి

సంగెం : ఉపాధిహామీ కూలీలకు వెంటనే కూలీ డబ్బులు చెల్లించాలని ఎంసీపీఐయూ మండల కార్యదర్శి ఇస్మాయిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని తీగరాజుపల్లి, గవిచర్ల, గాంధీనగర్ గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జరిగే చోట కూలీలను కలుసుకుని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు పని చేసి 45 రోజులైనప్పటికీ డబ్బులు రాలేదన్నారు. రెక్కాడితేనే డొక్కాడని కూలీలకు పూట గడిచేదేలా అని ప్రశ్నించారు. కూలీలు పనిచేసే చోట నీడ, మంచినీరు వంటి సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో దూడయ్య, మల్లేశం, రామారావు, అశోక్ పాల్గొన్నారు.

తేలనున్న పశుసంపద లెక్క

- గ్రామాల్లో కొనసాగుతున్న పశుగణన
- వివరాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్లు

దుగ్గొండి : రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే పూర్తయింది. ఇక ఐదేళ్లకోసారి నిర్వహించే ఇంటింటి పశుగణన ప్రారంభమైంది. ఎంపిక చేసిన ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి పశుసంపద వివరాలు సేకరిస్తున్నారు. ఐదేళ్లకోసారి జాతీయ స్థాయిలో పశుగణన చేపడుతుంటారు. ఇదే క్రమంలో గ్రామాల వారిగా తెల్ల, నల్ల పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు, పందులు, కుక్కలు ఇతర మూగజీవాల వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. అక్టోబర్ 25, 2024న ప్రారంభమైన సర్వే 2025 ఫిబ్రవరిలో ముగియనుంది. అయితే పశువులు డీవార్మింగ్, వ్యాక్సినేషన్ చేయాల్సి రావడం, సర్వేకు, చికిత్సకు ఒకే సిబ్బంది ఉండటంతో ఆలస్యమైంది. దీంతో ప్రభుత్వం ఏప్రిల్ 15 వరకు పొడిగించింది. ఈ మేరకు ఎన్యుమరేటర్‌లు వివరాల సేకరణలో బిజీబిజీగా గడుపుతున్నారు. మండల పరిధిలో 34 గ్రామ పంచాయతీల పరిధిలో ముగ్గురు ఎన్యుమరేటర్‌లు విధులు నిర్వర్తిస్తున్నారు. డెయిరీ ఫామ్‌లు, కోళ్ల ఫామ్స్‌తో పాటు గోశాలల వివరాలు సైతం నమోదు చేస్తున్నారు.



పశువుల వివరాలు ఆన్‌లైన్లో అప్‌లోడు చేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్ కవిత

పెరిగిన పశు సంపద..

సర్వే చేస్తున్న క్రమంలో పదేళ్లకు ఇప్పటికీ పశుసంపద భారీగా పెరిగినట్లు తెలుస్తుందని ఎన్యుమరేటర్‌లు చెబుతున్నారు. ఆవులు, గేదెల పెంపకం పదేళ్ల క్రితం చాలా అధ్వానంగా ఉండేదని ఇప్పుడు కనీసం రెండు కుటుంబాలకు ఒక కుటుంబం పాడి ఆవులు, గేదెలను పెంచుకుంటున్నట్లు ప్రాథమికంగా తెలుస్తుంది. పశుసంపద పెరిగితేనే వ్యవసాయ మనుగడ సాధ్యమవుతుందని ఇది మంచి పరిణామమని పర్యావరణ వేత్తలు అభిప్రాయ పడుతున్నారు. ప్రభుత్వం పశుపోషణ చేసే వారికి ప్రోత్సాహకాలు అందించాలని వారు సూచిస్తున్నారు.



ఇంటింటికి వెళ్లి పశువుల వివరాలు తెలుసుకుంటున్న పశువైద్య సిబ్బంది

వివరాలు అందించాలి



పశుగణన చేయడం వల్ల గ్రామాల వారీగా ఎన్ని పశువులు ఉన్నాయి. వాటికి ఎన్ని మందులు, టీకాలు, వ్యాక్సిన్లు అవసరం అవుతాయి అనే వివరాలు అందుబాటులోకి వస్తాయి. సర్వే వివరాల ప్రకారం ప్రభుత్వం నుంచి మందులు అందుతాయి. సమాచారం ఇవ్వని వారు ఉంటే సమీప పశువైద్యులకు సమాచారం అందించాలి. – శారద, పశువైద్యురాలు, తొగర్రాయి

నకిలీ, కల్తీ పదార్థాలు కొని మోసపోవద్దు

- సమాచార కేంద్రం బాధ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

నర్సంపేట : నకిలీ, కల్తీ పదార్థాలు, వస్తువులు కొని మోసపోవద్దని వినియోగదారుల సమాచార కేంద్రం బాధ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు వినియోగదారుల సమాచార కేంద్రం కమిటీల ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ బుక్‌లెట్‌తో నకిలీ, కల్తీ పదార్థాలు, వస్తువులు కొని నష్టపోవద్దని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సంపేట పట్టణంలో ఆర్డీఓ, జిల్లా నీటిపారుదలశాఖ, ఐసీడీఎస్, ఫైర్ స్టేషన్, మార్కెట్ సెక్రటరీ, తహసీల్దార్, పశుసంవర్ధకశాఖ అధికారి, సివిల్ సప్లై, స్టాక్ పాయింట్లు, వ్యవసాయశాఖ అధికారి, ఆబ్కారి శాఖ అధికారి, ఆర్టీసీ డీఎం, ఎఫ్ఆర్ఓ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ప్రభుత్వ మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్, చెన్నారావుపేట ఎస్సై నర్సంపేట మునిసిపల్ కమిషనర్, వరంగల్ జిల్లా పౌర సరఫరాల అధికారి, తదితర అధికారులను వారి వారి కార్యాలయాల్లో కలిసి ట్రేడ్ మార్కుల ప్రాధాన్యతను వివరించి బీఐఎస్ వారి బుక్‌లెట్‌ను అధికారులకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఐఎస్ఐ, హాల్ మార్క్, ఎఫ్ఎస్ఎస్ఏఐ, అగ్‌మార్క్ తదితర ప్రభుత్వ ట్రేడ్ మార్కులు ఉన్న ఆహార పదార్థాలు, వస్తువులు కొనాలన్నారు. ట్రేడ్ మార్కులు లేని నకిలీ వస్తువులు ఎక్కడ కనిపించినా సంబంధిత అధికారులకు టోల్ ఫ్రీ నంబర్లు, వాట్సాప్ నంబర్లు 8800001915, 1800114000, 180042500333, 1915 డ్రగ్స్, 18005996969 ఆబ్కారి, 18004252523, ఇతర ఆహార పదార్థాల కల్తీకి 9868686868, 1800112100 నంబర్లకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో వినియోగదారుల డీసీఐసీలు సుదర్శన్‌గౌడ్, కె.శ్రీనివాస్‌రావు, ప్రభాకర్, సారంగం, వెంకటాచారి, రాము, హన్మకొండ జిల్లా డీసీఐసీ ఠాకూర్ రతన్‌సింగ్ పాల్గొన్నారు.



ఆర్డీఓకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న వినియోగదారుల బాధ్యులు

భూముల అమ్మకాన్ని విరమించుకోవాలి

- సీపీఎం ఏరియా కమిటీ కార్యదర్శి నమిండ్ల స్వామి



నర్సంపేట : ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నర్సంపేట : సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మకాన్ని రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఎం ఏరియా కమిటీ కార్యదర్శి నమిండ్ల స్వామి అన్నారు. చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేటలో మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించి 400 ఎకరాల భూమిని కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పడం సరైన పద్ధతి కాదన్నారు. అంతేకాక భవిష్యత్‌లో విద్యార్థుల జీవితాలను గాడిన పడేసే విధంగా ఉందని, తప్పుడు ఆలోచన పద్ధతిలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడం విడ్డూరంగా ఉందన్నారు. జేసీబీలతో భూములను మొత్తం చదును చేస్తూ అడ్డు వచ్చిన విద్యార్థులపై అక్రమ కేసులు పెట్టి దాడులు చేయడం న్యాయం కాదన్నారు. అలాగే మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు రమేష్, సతీష్‌లను పోలీసు అధికారులు తెల్లవారు జామున అక్రమంగా అరెస్టు చేయడం ప్రజా ఉద్యమాలు చేసే నాయకులపై కేసులు పెట్టడం, ప్రశ్నించే గొంతుకలను అణిచివేయడం పద్ధతి కాదన్నారు. అరెస్టు అయిన నాయకులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అబ్బదాసి అశోక్, జనార్దన్‌రెడ్డి, బిల్లా భూపాల్‌రెడ్డి, యాకయ్య, మొగ్రి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



సంగెం : మాట్లాడుతున్న జక్క అశోక్

హెచ్‌సీయూ భూముల వేలం ఆపాలి

సంగెం : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన భూముల వేలంను ప్రభుత్వం వెంటనే ఆపాలని అఖిల భారత యువజన సమైక్య మండల కన్వీనర్ జక్క అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని కుంటపల్లిలో అఖిలభారత యువజన సమైక్య విద్యార్థి ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి సంఘం నాయకులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలన్నారు. రానున్న రోజుల్లో చదువుకునే విద్యార్థులకు దూరమయ్యే అవకాశం ఉందని విద్యార్థులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఎర్ర రాజు, జక్క రాజు, అశోక్, శ్రీనివాస్, సురేందర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడులు



నెక్కొండ: పేకాట స్థావరంపై పోలీసులు దాడులు జరిపిన సంఘటన మండలంలోని అలంకానిపేటలో మంగళవారం సాయంత్రం జరిగింది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. పక్కా సమాచారం మేరకు గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడులు జరిపారు. గ్రామానికి చెందిన ఎం. శ్రీను, ఎం.కుమారస్వామి, ఈ.లక్ష్మీనారాయణ, జి. జనార్దన్‌లను అరెస్టు చేశామని ఎస్సై తెలిపారు. వారి నుంచి రూ.42,780 నగదుతో పాటు పేక ముక్కలు, నాలుగు సెల్‌ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నామని ఎస్సై పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

నెక్కొండ : స్థానిక ఉమామహేశ్వర క్లాత్ స్టోర్ యజమాని అందె సత్యనారాయణ (56) సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు కూతుర్లు దివ్య, పావని, మౌనిక ఉన్నారు. పెద్ద కూతురు దివ్య తన తండ్రికి తలకొరివి పెట్టింది. మృతదేహాన్ని టీపీసీసీ సభ్యుడు రంజిత్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, తదితరులు సందర్శించారు.

ఎన్‌కౌంటర్ హత్యలను ఖండించాలి

- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నర్సంపేట: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఆదివాసులపై జరుగుతున్న హింస, దౌర్జన్యాలు, ఎన్‌కౌంటర్ల పేరుతో జరుగుతున్న హత్యలను అన్ని వర్గాల ప్రజలు ఖండించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు దయాకర్, ఎలకంటి రాజేందర్‌లు పిలుపునిచ్చారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆపరేషన్ కగార్‌కి వ్యతిరేకంగా ఏప్రిల్ 8న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద జరిగే ప్రజా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో సహజ సిద్ధంగా ఏర్పడ్డ ప్రకృతి సంపదను కార్పొరేట్ కంపెనీలకు కారు చౌకగా కట్టబెట్టేందుకే ఆదివాసులను అవసరమైతే బలవంతంగా ఖాళీ చేయిస్తున్నారన్నారు. ధర్నాకు మేధావులు, రచయితలు, కవులు,కళాకారులు, అన్ని వర్గాల ప్రజలు హాజరు కావాలని కోరారు. ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు కృష్ణ, సారంగపాణి, సాంబయ్య, వీరస్వామి, కొమురయ్య, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు ఆకుల వెంకటస్వామి, రంజిత్, అశోక్, క్రాంతికుమార్, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పూలక్క, సౌందర్య, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అజయ్, చందు, మదనన్న, కె.రాజేశ్వరి, లింగయ్య, పాల్గొన్నారు.

ముళ్లపొదల తొలగింపు

నల్లబెల్లి : మండల కేంద్రంలోని మధ్యల వాగు సమీపంలో రోడ్డుకు ఇరువైపుల ఉన్న ముళ్లపొదలను వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం శ్రమదానం చేసి తొలగించారు. అసోసియేషన్ అధ్యక్షుడు పడాల మురళి మాట్లాడుతూ ప్రమాదకరంగా ఉన్న ముళ్లపొదలతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదాలను నివారించేందుకు ముళ్లపొదలను తొలగించినట్లు తెలిపారు. వాకర్స్ పెండ్యాల మహేందర్, మిట్టగడపల సాంబయ్య, వైనాల జంపయ్య, సామల రాజు, ఉడుత కోటి పాల్గొన్నారు.



ముళ్లపొదలను తొలగిస్తున్న సభ్యులు

జై భీమ్.. జై సంవిధాన్‌ను విజయవంతం చేయాలి

- నర్సంపేట కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రవళిరెడ్డి

దుగ్గొండి : కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను గ్రామ గ్రామాన వివరించడానికి ఏర్పాటు చేసిన జై బీమ్.. జైసంవిధాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నర్సంపేట కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రవళిరెడ్డి అన్నారు. మండలంలోని గిర్నిబావి పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ వర్గీకరణ, ఎస్సీల కోసం అమలు చేస్తున్న పథకాలు, ఇందిరమ్మ ఇండ్లు,పేదలకు సన్నబియ్యం పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం రవళిరెడ్డిని నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ శాలువాతో సన్మానించారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రల్ల బాబు, నాయకులు ఇంద్రదేవ్, దనుంజయ, నర్సింగరావు, భరత్‌రెడ్డి, శివాజి, సుమంత్, ప్రకాష్, గోపి, మహిళా కాంగ్రెస్ జిల్లా నాయకులు సునిత, కోతి మమత, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సక్కుబాయి, ఉపాధ్యక్షురాలు సుజాత పాల్గొన్నారు.



రవళిరెడ్డిని సన్మానిస్తున్న శ్రీనివాసరెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పార్వతమ్మ

సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు

- ఎమ్మెల్యేలు యశస్వినిరెడ్డి, నాగరాజు
- రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ ప్రారంభం

సాక్షి, నెట్‌వర్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలతో పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతాయని పాలకుర్తి, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు మామిడాల యశస్విని రెడ్డి, కేఆర్ నాగరాజు అన్నారు. రాయపర్తి, వర్ధన్నపేట, నర్సంపేట, సంగెం, గీసుకొండ, ఖానాపురం, పర్వతగిరి, నెక్కొండ, చెన్నారావుపేట మండలాల్లోని ఆయా గ్రామాల్లోని రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పథకం నిరుపేదలకు వరం అని కొనియాడారు. రాయపర్తి మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, టీపీసీసీ సభ్యులు రంజిత్‌రెడ్డి, రామానంద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హామ్యానాయక్, రాజిరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు,రేషన్ డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.



వర్ధన్నపేట : ఇల్లందలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



రాయపర్తి: మాట్లాడుతున్న పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి



నర్సంపేట : సన్నబియ్యం పథకాన్ని ప్రారంభిస్తున్న పీసీసీ సభ్యుడు రామానంద్



నెక్కొండ : సన్నబియ్యం పథకాన్ని ప్రారంభిస్తున్న పీసీసీ సభ్యుడు రంజిత్‌రెడ్డి



ఖానాపురం : పంపిణీ చేస్తున్న హరిబాబు



పర్వతగిరిలో తహసీల్దార్ వెంకటస్వామి



నర్సంపేట : అమీనాబాద్‌లో ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్

వృత్తిలో అంకితభావంతో ఆదరణ



వెంకట్‌రెడ్డిని శాలువాతో సన్మానిస్తున్న డివిజనల్ మేనేజర్ సుబ్రహ్మణ్యన్

నర్సంపేట : వృత్తిలో అంకితభావంతోనే ఆదరణ లభిస్తుందని జీవిత బీమా సంస్థ వరంగల్ డివిజనల్ సీనియర్ డివిజనల్ మేనేజర్ సుబ్రహ్మణ్యన్ అన్నారు. స్థానిక బ్రాంచ్ కార్యాలయం ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన సీనియర్ బ్రాంచ్ మేనేజర్ వెంకట్‌రెడ్డి పదవీ విరమణ సభలో ఎస్‌డీఎం మాట్లాడుతూ జీవిత బీమా కష్టమర్లకు, ఎల్ఐసీ ఉద్యోగులకు సరైన సేవలు అందించడం వల్లనే పదవీ విరమణ పొందుతున్న ఎస్‌బీఎం వెంకట్‌రెడ్డికి మంచి ఆదరణ లభించిందన్నారు. కార్యక్రజుమంలో మార్కెటింగ్ మేనేజర్ ప్రసాద్ బసవరాజు, సేల్స్ మేనేజర్ రవిశంకర్, ఏబీ ఎం వీవీ. సాయి, శ్యాంసింగ్, లక్ష్మణ్, రాములు, ఏజెంట్లు, యూనియన్ నాయకులు గాదె మోహన్‌రెడ్డి, శ్రీహరి, కర్ణాకర్, కుమారస్వామి, రామ్‌నర్సయ్య, రాజలింగం, హుస్సేన్, పులి సుధాకర్, వెంకటనారాయణ, సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని కారు మెకానిక్ మృతి

గీసుకొండ: గొర్రెకుంట క్రాస్‌రోడ్డు వద్ద సోమవారం అర్ధరాత్రి ఆర్టీసీ బస్సు ఢీకొని కారు మెకానిక్ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేట శివారు సోమ్లతండాకు చెందిన భూక్య జయచంద్ర (23) వరంగల్‌లోని మహదేవ్ కార్ కేర్‌లో కారు మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. గొర్రెకుంట శివారులో చెడిపోయిన కారును రిపేర్ చేసి తన ద్విచక్రవాహనంపై తిరుగు ప్రయాణంలో గొర్రెకుంట క్రాస్‌రోడ్డులో రోడ్డు దాటుతున్నాడు. వరంగల్ నుంచి భద్రాచలం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చి అతడి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో జయచంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళవారం మృతుడి తండ్రి జవహర్ ఫిర్యాదు మేరకు డ్రైవర్ పోచమల్లన్నపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ మహేందర్ తెలిపారు.



జయచంద్ర(ఫైల్)

వివాహిత అదృశ్యం

సంగెం : మండలంలో ఓ వివాహిత అదృశ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం.. వెంకటాపూర్ గ్రామానికి చెందిన బొటిక ప్రభాకర్, భార్య కవిత దంపతులకు ఇద్దరు పిల్లలు కలిగిన తర్వాత మరణించింది. 2013లో ప్రభాకర్ సౌందర్యను రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు సంతానం. 3 నెలల క్రితం శాయంపేటలో సౌందర్య తల్లి చనిపోగా వెళ్లింది. అక్కడ సురేష్‌తో పరిచయమైంది. అప్పటి నుంచి అతనితో సౌందర్య తరచూ ఫోన్‌లో మాట్లాడుతుండేది. ఈ విషయాన్ని గమనించిన భర్త మందలించినప్పటికీ ఆమెలో మార్పు రాలేదు. గత మార్చి 27న సౌందర్య ఇంటి నుంచి ఆస్పత్రికి వెళ్లి వస్తానని చెప్పి సాయంత్రం వరకు తిరిగి రా లేదు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.పోలీస్‌స్టేషన్ 8712685029, ఎస్సై 8712685243 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.



సౌందర్య